# మానవ నాగరికత చిహ్నాలు మన వారసత్వ సంపదలు

## (18 ఏప్రిల్ " అంతర్జాతీయ స్మారక చిహ్నాలు - ప్రదేశాల దినోత్సవం" సందర్భంగా)

అంతర్జాతీయ మానవాళిని ఆకర్షిస్తున్న సహజ సిద్ధమైన లేదా మానవ నిర్మిత కట్టడాలు లేదా ప్రదేశాలను "వారసత్వ కట్టడాలు (హెరిటేజ్ స్ట్రక్చర్స్)" లేదా "స్మారక చిహ్నాలు (మాన్యుమెంట్స్)" లేదా" ప్రదేశాలు (సైట్స్)" అని పిలుస్తారు. అత్యంత పురాతన దేవాలయాల నుంచి అత్యద్భుత కట్టడాల వరకు అన్ని ప్రదేశాలు అనాదిగా మానవ నాగరికత చిహ్నాలుగా, గత వారసత్వ సంపద పునాదులుగా కొనసాగుతూనే ఉన్నాయి. వారసత్వ కట్టడాలు, ప్రదేశాలు మానవ సమాజ మానసిక ఆరోగ్య ప్రదాతలుగా, మానవాళి గత చరిత్రకు సాక్షాలుగా గంభీరంగా నిలబడి ఉన్నాయి. మన పునాదులను పటిష్ట పరుచుకోవడం, వాటి భద్రతకు నడుం బిగించడం నేటి ఆలోచనాపరమైన మానవాళి కర్తవ్యం. మనం నివసిస్తున్న ప్రదేశానికి ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. వాటిలో పురాతన కట్టడాలు, గత వైభవం కలిగిన దేవాలయాలు, అద్భుత సహజ ప్రకృతి ప్రదేశాలు, మనం సగర్వంగా చెప్పుకునే వారసత్వ కట్టడాలు ఉంటాయి.

**అంతర్జాతీయ స్మారక చిహ్నాలు-ప్రదేశాల దినోత్సవం :**

మన వారసత్వ కట్టడాలు, ఆకర్షణీయ స్థలాల మనుగడ నేడు ప్రశ్నార్థకంగా మారడం, విపత్తులు/సంక్షోభాల విష వలయంలో చిక్కి విధ్వంసానికి గురి కావడం జరుగుతున్న వేళ, మన వారసత్వ నిర్మాణాలను కాపాడుకోవాలనే సదుద్ధేశంతో "ఇంటర్నేషనల్ కైన్సిల్ ఆఫ్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్" సంస్థ చొరవతో పాటు యునెస్కో సౌజన్యంతో ప్రతి ఏట 18 ఏప్రిల్ రోజున ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ స్మారక చిహ్నాలు-ప్రదేశాల దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్)" లేదా " ప్రపంచ వారసత్వ దినోత్సవం (వరల్డ్ హెరిటేజ్ డే)" పాటించుట 1983 నుంచి కొనసాగుతున్నది. వారసత్వ కట్టడాలు, ఇతర ప్రజాదరణ పొందిన కట్టడాలు తరతరాలుగా మానవాళి విజ్ఞానాన్ని, వినోదాన్ని, మానసిక ప్రశాంతతను, పర్యాటకాన్ని అందిస్తూనే ఉన్నాయి. వీటిని అపురూపంగా కాపాడుకోవడం, వాటి పరిరక్షణకు అవసరమైన చర్యలను సత్వరమే తీసుకోవడం, మన సాంస్కృతిక వైభవ చిహ్నాలను సంరక్షించుకోవడం, వాటిని జాతీయ గుర్తింపు కలిగిన కట్టడాలుగా నిలబెట్టడం మన కనీస కర్తవ్యమని గమనించాలి.

**అంతర్జాతీయ స్మారక చిహ్నాలు-ప్రదేశాల దినోత్సవం-2025 ఇతివృత్తం:**

ఇంటర్నేషనల్ కైన్సిల్ ఆఫ్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్ ఏర్పడి 60 ఏండ్లు పూరితి అవుతున్న శుభ గడియల్లో 2025 అంతర్జాతీయ స్మారక చిహ్నాలు-ప్రదేశాల దినోత్సవ ఇతివృత్తంగా "విపత్తులు, సంక్షోభాలతో ప్రమాదంలో వారసత్వ కట్టడాలు - 60 ఏండ్ల ఇంటర్నేషనల్ కైన్సిల్ ఆఫ్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్ సంస్థ పకడ్బందీ కార్యాచరణ" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రకృతి సహజ విపత్తులు, మానవ సాయుధ సంక్షోభాలు, వాతావరణ ప్రతికూల మార్పులతో మన వారసత్వ కట్టడాల ఉనికి ప్రమాదపు అంచున నిలుస్తున్న వేళ ప్రభుత్వాలు, సంస్థలు, వృత్తి నిపుణ కళాకారులు, పౌర సమాజం, యువత చేయి చేయి కలిపి మన గత ఘన చరిత్రను కాపాడుకోవడం విధిగా జరగాలి.

**యునెస్కో గుర్తింపు పొందిన వారసత్వ కట్టడాలు, ప్రదేశాలు:**

ప్రపంచవ్యాప్తంగా యునెస్కో గుర్తింపు పొందిన వారసత్వ సంపదలు 1,092 ఉన్నాయి. వీటిలో అత్యధికంగా 845 సాంస్కృతిక, 209 సహజ, 38 మిశ్రమ కట్టడాలు లేదా ప్రదేశాలు ఉన్నాయి. ప్రపంచ దేశాల్లో అత్యధిక వారసత్వ కట్టడాల్లో ఇటలీలో 54, చైనాలో 53, స్పెయిన్‌లో 47, జర్మనీలో 44, ఫ్రాన్స్‌లో 44, ఇండియాలో 43 ఉన్నాయి. 2024లో భారతంలో 43వ యునెస్కో గుర్తింపు పొందిన కట్టడంగా అస్సాంలోని "మెయిడమ్ -అహోం రాజవంపు కట్టడం" జాబితాలో చేరింది.

మన దేశంలోని యునెస్కో గుర్తింపు పొందిన 43 కట్టడాల్లో ముఖ్యమైనవిగా అజంతా గుహలు, ఎల్లోరా గుహలు, ఆగ్రా కోట, తాజ్‌మహల్, కోనార్క్ సూర్య దేవాలయం, మహాబలిపురం, కాజిరంగా నేషనల్ పార్క్, ఖజురాహో స్మారక చిహ్నం, ఫతేపూర్ సిక్రీ, కుతుబ్ మినార్, ఢిల్లీ ఎర్ర కోట, రామప్ప దేవాలయం, శాంతినికేతన్ లాంటివి ఉన్నాయి.

మన పునాదులను కాపాడుకుంటూ, గత వైభవ చిహ్నాల నుంచి ప్రేరణ పొందుతూ, వాచి నుంచి విజ్ఞానాన్ని జుర్రుకుంటూ, పర్యాటక ప్రదేశాలుగా తలచి మానసిక ప్రశాంతతను పొందుతూ భాధ్యతాయుతంగా కొనసాగుదాం. మన వారసత్వ మనుగడను మనమే సంరక్షించుకుందాం.

- డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# 2023 బ్యాచ్ ఐఏఎస్ అధికారులతో రాష్ట్రపతి సమావేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో సహాయ కార్యదర్శులుగా పనిచేస్తున్న 2023 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారులతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ ఈ రోజు రాష్ట్రపతి కల్చరల్ సెంటర్లో సమావేశమయ్యారు.

యువ అధికారులను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి అసాధారణ సంకల్పం, కృషి ద్వారానే ఐఏఎస్‌లుగా ఎదిగారని ప్రశంసించారు. ఇది వారి వ్యక్తిగత జీవితాల్లోనూ మార్పులను తీసుకొచ్చిందని చెప్పారు. ఇప్పుడు మరింత పట్టుదల, అంకితభావంతో లెక్కలేనంత మంది ప్రజల జీవితాలను మార్చే అవకాశం వారికి ఉందని పేర్కొన్నారు. వారికి లభించిన సేవ, అధికారాల పరిధి విస్తృతమైనదని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ మొదటి పోస్టింగు నుంచే ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు ప్రయత్నించాలని సూచించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేకంగా కృషి చేయాలని రాష్ట్రపతి వారికి పిలుపునిచ్చారు. ఉద్యోగ జీవితంలో తరచూ క్షేత్ర స్థాయి సందర్శనలు చేపట్టాలని, వారు అమలు చేస్తున్న కార్యక్రమాలు ఎంత మేర ప్రజలకు అందుతున్నాయో చూడాలని సూచించారు.

ప్రభుత్వ ఉద్యోగుల హక్కులు, విధులను ఎల్లప్పుడూ అధికారులు గుర్తుంచుకోవాలని రాష్ట్రపతి అన్నారు. ప్రభుత్వ సేవకులు విధులను బాధ్యతగా తీసుకోవాలని ఆ బాధ్యతలను హక్కుగా భావించాలని తెలిపారు.

నిజమైన కెరీర్ సామాజిక మాధ్యమాల్లో తమను అనుసరించే వారి సంఖ్య ద్వారా కాదు, వాస్తవ జీవితంలో పని తీరు ద్వారానే రూపుదిద్దుకుంటుందని అన్నారు. సమాజంలో తమకు దక్కే గౌరవాన్ని సైతం వారి పనితీరే నిర్ధారిస్తుందని తెలిపారు.

ప్రతి ప్రభుత్వ ఉద్యోగి నిజాయతీతో పనిచేయాలని రాష్ట్రపతి అన్నారు. పర్యావరణ కాలుష్యం, వాతావరణ మార్పుల సవాళ్లను అందరూ ఎదుర్కొంటున్నామని అన్నారు. అనైతికత, విలువల క్షీణతను కూడా తీవ్రమైన సవాళ్లుగానే రాష్ట్రపతి పరిగణించారు. అంకితభావం, నిజాయతీ గురించి ఇంతకు మించి చెప్పాల్సిందేమీ లేదని అభిప్రాయపడ్డారు. నిజాయతీ, సత్యం, నిరాడంబరత అనే విలువలను పాటించే ప్రజల జీవితాలు సంతోషంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రజాసేవలో నిజాయతీని కచ్చితంగా అనుసరించాలని అన్నారు. ప్రభుత్వోద్యోగులు తమ జీవితంలో ప్రతి అంశంలోనూ సమగ్రత, సున్నితత్వానికి ఉదాహరణగా నిలవాలని ఆశిస్తారని రాష్ట్రపతి పేర్కొన్నారు.

డిజిటల్ యుగంలో ప్రజల ప్రాధాన్యతలు మారుతున్నాయని రాష్ట్రపతి అన్నారు. పరిపాలకుల జవాబుదారీతనం గురించి ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. ప్రజలతో మమేకమై వారిని స్థానికంగా చేపడుతున్న కార్యక్రమాలను భాగస్వామ్యం చేసేందుకు ప్రజలతో మమేకం అవ్వాలని సూచించారు. అలాగే ప్రజా ప్రతినిధులు లేవనెత్తే ప్రజాప్రయోజన అంశాలను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో వారు చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే జాతీయ లక్ష్యాలను సాధించడంలో తోడ్పడతాయని అన్నారు.

# డెన్మార్క్ ప్రధాన మంత్రి మెట్టె ఫ్రెడరిక్సేన్‌తో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:డెన్మార్క్ ప్రధాన మంత్రి గౌరవ మెట్టె ఫ్రెడరిక్ సన్‌తో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ఫోన్‌లో మాట్లాడారు. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ప్రపంచ పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించారు.

2020లో వ్యూహాత్మక హరిత భాగస్వామ్యం (గ్రీన్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్) ప్రారంభించినప్పటి నుంచి ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయిలో జరిగిన చర్చలను గుర్తు చేసుకున్న నాయకులు వివిధ రంగాలలో ఈ భాగస్వామ్యాన్ని విస్తరించటం గురించి ప్రస్తావించారు. ఇది భారతదేశంలో హరిత పరివర్తనకు ఉపయోగపడే విధంగా డెన్మార్క్ పెట్టుబడులకు అనుకూలమైన పరిస్థితులను సృష్టించిందని అన్నారు. పరస్పర ప్రయోజనాలున్న ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై నేతలు చర్చించారు.

ఈ ఏడాది చివర్లో నార్వేలో జరగనున్న 3వ భారత్- నార్డిక్ శిఖరాగ్ర సదస్సు, ఇందులో భాగంగా ప్రధాని ఫ్రెడెరిక్సేన్‌తో భేటీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు.

# జైలర్ నిర్లక్ష్యంతోనే రిమాండ్ ఖైదీ మృతి.. గ్రామస్తుల బైఠాయింపు



ఆదిలాబాద్, ఏప్రిల్ 17:ఆదిలాబాద్ జైల్లో ముథోల్ మండల కేంద్రానికి చెందిన సిందే సాయినాథ్(32) ఖైదీగా ఉన్న వ్యక్తి చనిపోవడంతో ఒక్కసారిగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీస్ స్టేషన్ ముందు న్యాయం కావాలని బైఠాయించారు. సిందే సాయినాథ్ అనుమానాస్పద మృతికి జైలరే కారణమని ఆరోపించారు. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం? గత ఫిబ్రవరి నెలలో ఒక కేసు విషయంలో సిందే సాయినాథ్ తో పాటు ముగ్గురు వ్యక్తులు ఆదిలాబాద్ జైలుకు తరలించారు. అప్పటి నుండి జైలుకు వెళ్లి చూడడానికి జైలర్ అనుమతి ఇవ్వలేదని పేర్కొన్నారు. నాలుగు సార్లు బెయిల్ కు దరఖాస్తు చేసుకున్నా బెయిలు మంజూరు కాలేదు. చనిపోయిన తర్వాత చాకచక్యంగా బెయిల్ మంజూరు చేశారని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపించారు.

జైలులో ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో రిమ్స్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా హైదరాబాద్ గాంధీకి రెఫర్ చేశారు. సిందే సాయినాథ్ ఆరోగ్యం బాగాలేదని, రెండు రోజుల క్రితం ఆదిలాబాద్ జైలు నుండి సమాచారం రాగానే హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి వెళ్లామని, అప్పుడు సిందే సాయినాథ్ ను కాళ్లకు గొలుసులతో కట్టేసి ఉంచారని తెలిపారు. పూర్తి స్పృహలో లేకుండా దీనావస్థలో ఉన్నాడని తెలిపారు. జైలుకు వెళ్లే ముందు పూర్తి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, జైలుకు ఆరోగ్యంగా వెళ్లిన వ్యక్తి చనిపోవడం ఏమిటని ప్రశ్నించారు. జైలర్ పూర్తి నిర్లక్ష్యంతోనే జైలులో ఉన్న సిందే సాయినాథ్ చనిపోయాడని అన్నారు. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి, ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మృతునికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.

చట్టపరంగా జ్యుడీషియల్ దర్యాప్తు జరుగుతుంది? సి.ఐ మల్లేష్, ఎస్సై సంజీవ్

ఆదిలాబాద్ జైలులో రిమాండ్ లో ఉన్న ఖైదీ చనిపోవడం వల్ల చట్ట పరంగా జ్యుడీషియల్ దర్యాప్తు జరుగుతుందని సి.ఐ మల్లేష్, ఎస్సై సంజీవ్ పేర్కొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ జారీ..

## నేటి నుంచి కొత్త రిజర్వేషన్లు అమలు



అమరావతి, ఏప్రిల్ 17: ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ జారీ చేసింది ఎపి ప్రభుత్వం. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆమోదం అనంతరం ఇందుకు సంబంధించిన గెజిట్‌ను న్యాయశాఖ జారీ చేసింది. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవి నేడు ఉత్తర్వులు ఇచ్చారు. కాగా,ఈ బిల్లు నేటి నుంచి అమలు కానున్న సందర్భంగా మాదిగ పోరాట సమితి అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఎపి ప్రభుత్వ ప్రదాన కార్యదర్శి విజయానంద్ కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇక, ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్ ప్రకారం 59 ఉపకులాలను మూడు గ్రూపులుగా విభజించినట్లు మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. గ్రూవ్-1లోని 12 ఉపకులాలకు 1 శాతం, గ్రూప్-2లోని 18 ఉపకులాలకు 6.5 శాతం, గ్రూప్-3లోని 29 ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్లు వర్తింపజేయనున్నట్లు ఆయన వివరించారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఫలాలు అన్ని ఉపకులాలకు సమానంగా అందేలా 200 పాయింట్ల రోస్టర్ విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

గ్రూప్-1 (1% రిజర్వేషన్)

ఈ గ్రూపులో రెల్లి కులంతో పాటు మొత్తం 12 ఉపకులాలు ఉన్నాయి. వీటికి కలిపి 1 శాతం రిజర్వేషన్‌ను కేటాయించారు.

ఈ గ్రూపులోని ఉపకులాలు: బవురి, చచాటి, చండాల, దండాసి, డొమ, ఘాసి, గొడగలి, మెహతర్, పాకీ, పామిడి, రెల్లి, సాప్రు.

గ్రూప్-2 (6.5% రిజర్వేషన్

మాదిగ కులంతో పాటు మొత్తం 18 ఉపకులాలను గ్రూప్-2గా వర్గీకరించారు. ఈ గ్రూపునకు 6.5 శాతం రిజర్వేషన్లు దక్కనున్నాయి.

ఈ గ్రూపులోని ఉపకులాలు: అరుంధతీయ, బిందల, చమార్, చంభార్, దక్కల్, ధోర్, గొదారి, గోసంగి, జగ్గాలి, జంబువులు, కొలుపులవాండ్లు, మాదిగ, మాదిగ దాసు, మాంగ్, మాంగ్ గరోడి, మాతంగి, సమగార, సింధోలు.

గ్రూప్-3 (7.5% రిజర్వేషన్)

మాల కులంతో పాటు అత్యధికంగా 29 ఉపకులాలు ఈ గ్రూపులో ఉన్నాయి. గ్రూప్-3కి అత్యధికంగా 7.5 శాతం రిజర్వేషన్లు కేటాయించారు.

ఈ గ్రూపులోని ఉపకులాలు:

ఆది ద్రవిడ, అనముక్, అరయ మాల, అర్వ మాల, బారికి, బ్యాగర, చలవాది, ఎల్లమలవార్, హోలేయ, హోలేయ దాసరి, మదాసి కురువ, మహర్, మాల, మాల దాసరి, మాల దాసు, మాల హన్నాయి, మాలజంగం, మాల మస్తి, మాల సాలె, మాల సన్యాసి, మన్నే, మండల, సంబన్, యాతల, వల్లువన్, ఆది ఆంధ్ర, మస్తి, మిట్టా అయ్యలవార్, పంచమ.

# కేంద్రమంత్రికి చంద్రబాబు అభినందనలు

అమరావతి, ఏప్రిల్ 17:కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, శ్రీకాకుళం ఎంపీ కింజారపు రామ్మోహన్ నాయుడు ప్రతిష్ఠాత్మక వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) 'యంగ్ గ్లోబల్ లీడర్' (వైజీఎల్)-2025 గా ఎంపికైన సందర్భంగా తెలుగుదేశం పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఆయన రామ్మోహన్ నాయుడికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

రామ్మోహన్ నాయుడికి లభించిన ఈ అంతర్జాతీయ గుర్తింపు పట్ల చంద్రబాబు స్పందిస్తూ? ఇది రామ్మోహన్ నాయుడి అంకితభావం, కృషి, దార్శనికతకు లభించిన సరైన గౌరవమని కొనియాడారు. "యువ వయసులోనే రాజకీయాల్లోకి వచ్చి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, అతి చిన్న వయసులోనే కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి, ఇప్పుడు ప్రపంచ వేదికపై 'యంగ్ గ్లోబల్ లీడర్'గా గుర్తింపు పొందడం తెలుగువారందరికీ గర్వకారణం" అని పేర్కొన్నారు.

రామ్మోహన్ నాయుడి నాయకత్వ లక్షణాలు, ప్రజాసేవ పట్ల నిబద్ధత యువతరానికి స్ఫూర్తిదాయకమని ఆయన ప్రశంసించారు. ఈ గుర్తింపుతో రామ్మోహన్ నాయుడు దేశానికి, రాష్ట్రానికి మరింత సేవ చేసేందుకు ఉత్తేజితుడవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేయడంలో కీలక పాత్ర పోషించాలని చంద్రబాబు ఆకాంక్షించారు.

# కొల్లేరు వాసులకు సుప్రీంలో ఊరట...

## -భూమల వివాదంపై 12 వారాలలో నివేదిక ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: కొల్లేరు వాసులకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయనే నమ్మకం పెరుగుతుంది. కొల్లేరు ప్రాంత జిరాయితీ భూముల యజమానులు దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. అనంతరం కొల్లేరు వివాదానికి కారణమవుతున్న అంశాలపై 12 వారాల్లో నివేదిక ఇవ్వాలని కేంద్ర సాధికార సంస్థకు అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

దీంతో దశాబ్దాలుగా తాము ఎదుర్కొంటున్న సమస్యలకి పరిష్కారం దొరుకుతుందనే ఆశతో కొల్లేరు వాసులు ఉన్నారు.కొల్లేరు ప్రాంతంలో 5వ కాంటూరు పరిధిలో ఉన్న ఆక్రమణలు తొలగించి సరస్సు సరిహద్దులు నిర్ధారించాలంటూ 2008లో సుప్రీం ఆదేశించినా.. అమలు చేయకపోవడంతో కాకినాడకు చెందిన మృత్యుంజయ రావు అనే వ్యక్తి కోర్టు ధిక్కరణ కేసు దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. వన్యప్రాణి సంరక్షణ కేంద్రం పరిధిలో ఎలాంటి ఆక్రమణలు, సహజ సిద్ధ నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకాలు ఉండరాదని.. కొల్లేరులో ఉన్న వాస్తవ పరిస్థితులను నివేదిక ఇవ్వాలంటూ గత ఏడాది డిసెంబర్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

కోర్టు ఆదేశాలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ.. 2006 తర్వాత ఆక్రమణలూ తొలగించామని, తిరిగి ఆక్రమణలు చోటు చేసుకోవడంతో వాటిని తొలగించే పనిలో ఉన్నట్టుగా స్పష్టం చేసింది. ఇదే సమయంలో +5 కాంటూరు పరిధికంటే అదనంగా భూములు ధ్వంసం చేశారని, ప్రైవేటు, జిరాయితీ భూములకు పరిహారం చెల్లించకుండానే ధ్వంసం చేశారని భూయజమానులు దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఇంప్లీడ్ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్‌గవాయి, జస్టిస్ ఏజీ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం నేడు విచారణ జరిపింది. కొల్లేరులో క్షేత్రస్థాయి పరిస్థితి ఏంటి, +5 కాంటూర్ పరిధిలో జిరాయితీ భూములు ఉన్నాయా, కొల్లేరును వన్యప్రాణి సంరక్షణ కేంద్రంగా ప్రకటించినప్పుడు దాని పరిధిలోకి వచ్చే ప్రైవేటు జిరాయితీ భూముల హక్కులను చట్టపరంగా నిర్ధారించారా.. లేదా.. అన్నదానిపై 12 వారాల్లోపు నివేదికఇవ్వాలని కేంద్ర సాధికార సంస్థకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ 12 వారాలకు వాయిదా వేసింది.

# బ్రెజిల్ రాజధాని బ్రెజిలియాలో జరిగే 15వ బ్రిక్స్ వ్యవసాయ మంత్రుల సదస్సుకు హాజరు కానున్న కేంద్రమంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:బ్రెజిల్ రాజధాని బ్రెజిలియాలో జరిగే 15వ బ్రిక్స్ వ్యవసాయ మంత్రుల సదస్సుకు (ఏఎంఎం) హాజరయ్యే భారత ప్రతినిధి బృందానికి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వం వహిస్తారు. "సహకారం, సృజన, నిష్పక్షపాత వాణిజ్యం ఆధారంగా బ్రిక్స్ దేశాల్లో సమ్మిళిత సుస్థిర వ్యవసాయానికి ప్రోత్సాహం" - 15వ బ్రిక్స్ వ్యవసాయ మంత్రుల సమావేశాల ఇతివృత్తంగా నిర్ణయించారు. బ్రిక్స్ కూటమికి చెందిన బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, సౌదీ అరేబియా, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్ దేశాల వ్యవసాయ మంత్రులు, సీనియర్ అధికారులు ఈ సదస్సుకు హాజరవగలరని భావిస్తున్నారు.

సదస్సు నేపథ్యంలో బ్రెజిల్ వ్యవసాయ, పశుపోషణ మంత్రి కార్లోస్ హెన్రిక్ బకేటా ఫవారో... వ్యవసాయాభివృద్ధి, ఉద్యాన తోటల శాఖ మంత్రి లూయిజ్ పాలో టెయిక్సెయిరా సహా ఇతర మంత్రులతో జరిగే ద్వైపాక్షిక సమావేశాల్లో శ్రీ చౌహాన్ పాల్గొంటారు. ఈ సమావేశాల్లో భారత్-బ్రెజిల్ దేశాల మధ్య వ్యవసాయానికి సంబంధించిన వ్యవసాయ సాంకేతికత, గ్రామీణాభివృద్ధి, ఆహార భద్రత తదితర రంగాల్లో సహకారం పెంపుపై దృష్టి పెడతారు.

# రోడ్ టు గేమ్ జామ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:భారత ప్రభుత్వం ప్రారంభించిన ప్రపంచ దృశ్య-శ్రవణ, వినోద రంగ సదస్సు (వేవ్స్) తొలి సంచికలో భాగంగా ఏర్పాటైన క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్ లోని మొట్టమొదటి 'రోడ్ టు గేమ్ జామ్' కార్యక్రమ టాప్-10 గేముల గురించిన ప్రకటన వెలువడింది. దాంతో ఈ పోటీల్లో విజయబావుటా ఎగురవేసిన దేశ యువ గేమ్ డెవలపర్లు అందరి దృష్టినీ ఆకట్టుకుంటున్నారు. దేశ గేమింగ్ రంగ భవిష్యత్తుని తీర్చిదిద్దడంలో తమ వంతు పాత్ర పోషించే ఈ సాటిలేని టైటిల్స్ ను మే 1వ తేదీ నుంచి 4 వరకూ ముంబయి వేదికగా జరిగే వేవ్స్ సదస్సులో ప్రదర్శిస్తారు.

గేమ్ డెవలపర్లు తమ సృజనను, ఆవిష్కరణలను ప్రదర్శించేందుకు రోడ్ టు గేమ్ జామ్ చక్కని అవకాశాలను కల్పిస్తోంది. కెజెన్ (క్రేటోస్ గేమర్ నెట్వర్క్) సహకారంతో గేమ్ డెవలపర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (జీడీఏఐ) ప్రారంభించిన ఈ పథకం వేవ్స్ లోని పిల్లర్-2 లో భాగం. ఈ కార్యక్రమం ఏవీజీసీ -ఎక్స్ ఆర్ (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, మెటావర్స్) పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తుంది. నూతన టాలెంట్ కు జాతీయస్థాయి వేదిక కల్పించే ఈ కార్యక్రమం, సృజన, సహకారాలను ప్రోత్సహిస్తూ దేశ గేమింగ్ వాతావరణాన్ని బలోపేతం చేస్తోంది.

స్పందన, భాగస్వామ్యం

దేశంలోని 453 నగరాలు, పట్టణాల్లోని 1,650కి పైగా కళాశాలల నుంచి 5,500కి పైబడిన రిజిస్ట్రేషన్‌లతో, యువ గేమ్ డెవలప్‌మెంట్ ప్రతిభను పెంపొందించడంలో గేమ్ జామ్ కీలక పాత్ర పోషిస్తోంది. ఏఎంఏ సెషన్‌లు, పరిశ్రమ ప్రముఖుల నేతృత్వంలో వర్క్ షాపులు వంటి కార్యక్రమాలు గేమ్ డిజైన్, స్టోరీటెల్లింగ్, గేమింగ్ వ్యాపారంలో విలువైన పాఠాలను, సూచనలను అందించాయి. పలు దశల వడపోతల అనంతరం దాదాపు 175 జట్లు తాము రూపొందించిన గేములను సమర్పించాయి. వీటిని గేమింగ్ పరిశ్రమకు చెందిన అనుభవజ్ఞుల జ్యూరీ పరిశీలించింది.

టాప్ టెన్ ఫైనలిస్టులు

రోడ్ టు గేమ్ జామ్ కోసం ఎంపిక చేసిన టాప్-10 గేములను మే 1 నుంచి 4 వరకు ముంబయిలో జరిగే వేవ్స్ సమ్మిట్‌లో ప్రదర్శిస్తారు. ఈ ఒరిజినల్ టైటిల్స్ విద్యార్థి బృందాలు, సోలో డెవలపర్‌లు, ప్రారంభ దశలోని అంకుర సంస్థల సృజనాత్మక స్వరాల పరిధిని ప్రతిబింబించాయి. దేశంలో అభివృద్ధి చెందుతున్న అత్యుత్తమ గేమ్ డెవలప్‌మెంట్ ప్రతిభకు తార్కాణంగా నిలిచాయి.

పురస్కారాలు-గుర్తింపు

తుది పోటీకి అర్హత సాధించిన టావ్-10 విజేత జట్లకు, ముంబయిలో జరిగే వేవ్స్ సమ్మిట్‌కు అన్ని ఖర్చులతో కూడిన పర్యటన బహుమానాన్ని అందిస్తున్నారు. తమ గేమ్‌లను ప్రపంచ పరిశ్రమ జ్యూరీ ఎదుట ప్రదర్శించే అపురూపమైన అవకాశం ఈ జట్లకు లభిస్తుంది. ఇక మొదటి మూడు ఎంట్రీలకు కలిపి రూ. 7 లక్షల ప్రైజ్ మనీ దక్కుతుంది. తొలి స్థానానికి రూ. 3.5 లక్షలు, రెండో స్థానానికి రూ. 2 లక్షలు, మూడో స్థానం పొందిన వారికి రూ. 1.5 లక్షల బహుమతి సొమ్మును అందజేస్తారు.

గేమ్ జామ్ ఇతివృత్తాలు

గేమ్ జామ్ విలక్షణ ఇతివృత్తాలను ఇక్కడ చూడవచ్చు. సాంకేతిక ఆవిష్కరణలతో సృజనాత్మకతను మిళితం చేసేందుకు అవసరమయ్యే ప్రేరణను ఈ ఇతివృత్తాలు కలిగిస్తాయి.

గేమ్ డెవలప్మెంట్ రంగంలో పెరుగుతున్న భారత్ ప్రాభవం

గేమింగ్ రంగంలో ప్రపంచ శక్తిగా భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతోంది. దేశ మార్గదర్శక, ఇంటరాక్టివ్ మీడియా- గేమింగ్ వెంచర్ క్యాపిటల్ సంస్థ అయిన లుమికై ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం, దేశం 550 మిలియన్లకు పైగా గేమర్‌లకు నిలయంగా ఉంది, వారిలో 175 మిలియన్ల మంది ఇన్-గేమ్ కొనుగోళ్లు చేస్తున్నారు. అందుబాటు ధరల్లో డేటా లభ్యత, మొబైల్-ఫస్ట్ గేమింగ్ సంస్కృతి, డిజిటల్ అవగాహన మెండుగా ఉన్న యువత, సంఖ్యాపరంగా అత్యధిక యువజనులు వంటి కీలకమైన అంశాలపై ఆధారపడిన భారీ యూజర్ బేస్ లో 65 శాతం కంటే ఎక్కువ మంది 35 ఏళ్ళ లోపు వయసున్న వారు కావడం గమనార్హం.

ఈ రంగంలో దేశం సిసలైన బలం వినియోగదారుల సంఖ్యలో మాత్రమే కాక దాని సృజనాత్మక సామర్థ్యంలో కూడా నిక్షిప్తమై ఉంది. విస్తారమైన ఇంజనీరింగ్, డిజైన్ టాలెంట్.. అభివృద్ధి చెందుతున్న ఇండీ డెవలపర్ కమ్యూనిటీ.. పెరుగుతున్న ప్రభుత్వ, పరిశ్రమల మద్దతుతో గేమ్స్ సృష్టి, గేమింగ్ సొల్యూషన్ల ఉత్పత్తికి గ్లోబల్ హబ్‌గా మారేందుకు దేశం సన్నద్ధంగా ఉంది. నైపుణ్యం, మౌలిక వసతులు, మూలధన నిధులపై పెరుగుతున్న పెట్టుబడులు ఈ రంగానికి బలమైన పునాదిని వేస్తుండటంతో జాతీయ, రాష్ట్ర-స్థాయి గేమింగ్ శిక్షణా కార్యక్రమాలు ఊపందుకుంటున్నాయి. గ్లోబల్ పబ్లిషర్‌లు, స్టూడియోలు, ప్లాట్‌ఫాంలు భారతీయ ప్రతిభను అభివృద్ధి పరచడంలో, పెట్టుబడిని పెట్టడంలో ఆసక్తిని చూపుతున్నాయి. ఇవన్నీ గ్లోబల్ గేమింగ్ ఎకోసిస్టమ్‌లో దేశ స్థితిని మరింత సుస్థిరపరుస్తున్నాయి.

రోడ్ టు గేమ్ జామ్ దేశ నూతన తరం గేమ్ డెవలపర్‌ల అపారమైన ప్రతిభ, సృజనను గుర్తించడమే కాకుండా గ్లోబల్ గేమింగ్ వేదికకు నాయకత్వం వహించేందుకు దేశానికి గల సత్తాను కూడా ప్రదర్శించింది. ఔత్సాహిక సృష్టికర్తలు, పరిశ్రమ మార్గదర్శకులు, అంతర్జాతీయ ప్లాట్‌ఫాంలను ఏకతాటి పైకి తీసుకురావడం ద్వారా ఈ కార్యక్రమం బలమైన, మరింత సమగ్రమైన గేమ్ డెవలప్‌మెంట్ వాతావరణానికి పునాదులు వేసింది. ముంబైలో జరిగే వేవ్స్ సమ్మిట్‌లో పాల్గొనే టాప్-10 జట్లు తమ గేమ్‌లను ప్రదర్శించేందుకు సిద్ధమవుతున్న సందర్భంలో, వారి ప్రయాణం భారతదేశాన్ని శక్తివంతమైన గేమింగ్ మార్కెట్‌గా మాత్రమే కాకుండా సిసలైన ప్రపంచ స్థాయి గేమ్ సృష్టికర్తగా నిలపాలన్న విస్తృత జాతీయ ఆశయాన్ని ప్రతిబింబిస్తుంది.

# ఈ ఏడాది నైరుతి వర్ష రుతువులో సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం!...

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:2025లో యావత్తు దేశంలో నైరుతి రుతుపవనాలు (జూన్ మొదలు సెప్టెంబరు మధ్య కాలం) సామాన్యం కన్నా ఎక్కువ (దీర్ఘకాలిక సగటు ఖఎల్‌పీఏరితో పోల్చి చూసినప్పుడు 104 శాతానికి మించి) వర్షాలను అందిస్తాయన్న అంచనా ఉంది. పరిమాణాత్మకంగా చూస్తే, దేశమంతటా రుతుపవనాధారిత వానలు 5 శాతం మేర ఎక్కువో లేదా తక్కువో ఉంటూ, ఎల్‌పీఏతో పోలిస్తే 105 శాతంగా నమోదయ్యే వీలు ఉంది. 1971–2020 మధ్య కాలానికి పూర్తి దేశంలో రుతుపవన వర్షాల దీర్ఘకాలిక సగటు (ఎల్‌పీఏ) 87 సెంటీమీటర్లుగా నమోదైంది.

భూమధ్యరేఖకు చేరువగా ఉన్న పసిఫిక్ ప్రాంతంలో ప్రస్తుతం తటస్థ ఎల్ నినో–దక్షిణ డోలనం (ఈఎన్ఎస్ఓ) స్థితి విస్తరించి ఉంది. ఏమైనా, వాతావరణ ప్రసరణ లక్షణాలు 'లా నినా' స్థితులను తలపిస్తున్నాయి. అత్యంత తాజా మాన్‌సూన్ మిషన్ క్లైమేట్ ఫోర్‌కాస్ట్ సిస్టమ్ (ఎంఎంసీఎఫ్ఎస్)తోపాటు ఇతరత్రా వాతావరణ నమూనా అంచనాలను బట్టిచూడగా, వర్షరుతువు వేళ తటస్థ ఈఎన్ఎస్ఓ స్థితే కొనసాగేటట్లు అనిపిస్తోంది.

ప్రస్తుతానికి, హిందూ మహాసముద్రం ఎగువభాగంలో తటస్థ హిందూ మహాసముద్ర ద్విధ్రువ (ఇండియన్ ఓషన్ డైపోల్..ఐఓడీ) స్థితులు ఏర్పడ్డాయి. అత్యంత తాజా శీతోష్ణ స్థితి నమూనాల తాలూకు ముందస్తు అంచనాలు నైరుతి రుతుపవనాలు ప్రధానంగా ఉండే వర్ష రుతువులో తటస్థ ఐఓడీ స్థితులే కొనసాగేందుకు ఆస్కారముందని సూచిస్తున్నాయి.

గత మూడు నెలల (ఈ ఏడాది జనవరి మొదలు మార్చి నెల మధ్య) కాలంలో భూగ్రహ ఉత్తరార్థ గోళంతోపాటు యూరేషియాలో హిమపాత ప్రాంతాలు సాధారణం కన్నా తక్కువ స్థితిని కలిగి ఉన్నాయి. ఉత్తరార్థ గోళంతోపాటు యూరేషియాలో శీతరుతువులోనూ, వసంత కాలంలోనూ మంచు కురిసే ప్రాంతాలు సాధారణంగా ఆ తరువాతి భారతీయ వేసవికాలపు రుతుపవన వర్షాలతో విలోమ సంబంధాన్ని ఏర్పరుస్తూ ఉంటాయి. వాతావరణ విభాగం 2025 మే నెల చివరి వారంలో రుతుపవన ఆధారిత వర్షపాతం విషయంలో సవరించిన ముందస్తు అంచనాలను విడుదల చేయనుంది.

దేశంలో పూర్తి వర్ష రుతువు (జూన్ నుంచి సెప్టెంబరు) వర్షపాత సంబంధిత అయిదు కేటగిరీల సంభావ్యత ముందస్తు అంచనాలను ఈ కింద పట్టికలో గమనించవచ్చు. ఇవి నైరుతి రుతుపవన వర్షాలు సామాన్యం కన్నా ఎక్కువగా గాని, లేదా అంతకన్నా అధికంగా (ఎల్‌పీఏలో 104 శాతానికి మించి) ఉండేందుకు ప్రబలమైన అవకాశాలు (59 శాతం మేరకు) ఉన్నాయని సూచిస్తున్నాయి.

2025 సంవత్సరంలో జూన్ నుంచి సెప్టెంబరు మధ్య వర్షాలకు సంబంధించి మూడు శ్రేణుల (సాధారణం కన్నా ఎక్కువ, సాధారణం, సాధారణం కన్నా తక్కువ). .అవకాశాలతో కూడిన ముందస్తు అంచనాల ప్రాంతీయ విస్తరణ తీరును 1వ చిత్రంలో చూడవచ్చు. దీనిని గమనించినప్పుడు వాయవ్య, ఈశాన్య విభాగాల్లో కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలావరకు భాగాలలో సాధారణం నుంచి ఎక్కువ రుతుపవన వర్షాలు కురిసేందుకు అవకాశం ఉంది. భారత్‌లోని దక్షిణ ద్వీపకల్పంలో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదవ్వొచ్చనిపిస్తోంది.

# అమరావతి విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని ప్రశంసించిన ప్రధాని

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:అమరావతి విమానాశ్రయ ప్రారంభోత్సవం మహారాష్ట్రకు, ముఖ్యంగా విదర్భ ప్రాంతానికి శుభవార్త అని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రశంసించారు.

అమరావతి విమానాశ్రయం వాణిజ్యాన్ని, రవాణా సదుపాయాన్ని మెరుగుపరుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో కేంద్ర పౌర విమానయాన మంత్రి శ్రీ రామ్ మోహన్ నాయుడు కింజరపు పోస్టుకు స్పందనగా, శ్రీ మోదీ ఇలా పేర్కొన్నారు:

"మహారాష్ట్రకు, ప్రత్యేకించి విదర్భ ప్రాంతానికి ఇది గొప్ప వార్త. అమరావతిలో విమానాశ్రయం వాణిజ్యానికి ఊతమివ్వడంతోపాటు రవాణా సదుపాయాలను మెరుగుపరుస్తుంది."

# రాజన్నకు కొత్త గుడి, మూడు దశలలో అభివృద్ధి

**–శ్రీకారం చుట్టిన ప్రభుత్వం**
**–33 కోట్లతో కల్యాణ మండపం నిర్మాణం**
**–జూన్ 15 నుంచి దర్శనాలు నిలిపివేత**
**–భీమేశ్వరాలయంలో స్వామి దర్శనాలు**
**–శృంగేరీ పీఠాధిపతుల సూచన మేరకు నిర్మాణాలు**
**–చారిత్రక ప్రధాన ఆలయం తొలగించకుండా విస్తరణ**

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 17: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, విస్తరించే పనులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. మూడు దశల్లో ఆలయం, పరిసరాలను అభివృద్ధి చేయబోతోంది. ఇందులో తొలి దశ పనులను జూన్‌లో ప్రారంభించాలని నిర్ణయించింది. జూన్ 15 నుంచి ప్రధాన దేవాలయంలోకి భక్తులను అనుమతించరు. కేవలం నిత్య పూజలను మాత్రం అర్చకులు ప్రధాన దేవాలయ గర్భాలయంలో నిర్వహిస్తారు. భక్తులకు స్థానిక భీమేశ్వరాలయంలో స్వామి దర్శనం కొనసాగుతుంది. ఏడాదిన్నర నుంచి రెండేళ్లలో మొదటి దశ పనులు పూర్తి చేయనున్నారు. అప్పటి వరకు రాజరాజేశ్వర స్వామి దేవాలయంలోని ఉత్సవ మూర్తులను భీమేశ్వరాలయంలో ఉంచి భక్తులకు దర్శనాలు, కైంకర్యాలు కొనసాగిస్తారు.

రూ.550 కోట్లతో ప్రణాళిక

బీఆర్ఎస్ ప్రభుత్వం యాదగిరిగుట్ట దేవాలయాన్ని పునర్నిర్మించిన విషయం తెలిసిందే. గర్భాలయంలోని మూల విరాట్టు ప్రాంగణాన్ని అలాగే ఉంచి మిగతా మొత్తం ఆలయం స్థానంలో పూర్తి కొత్త ఆలయాన్ని నిర్మించారు. శతాబ్దాల చరిత్ర ఉన్న పురాతన ఆలయాన్ని తొలగించటం పట్ల భక్తుల్లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో వేములవాడ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటోంది. శృంగేరీ శంకరమఠం పీఠాధిపతి సూచించిన మార్పులను మాత్రమే పరిగణనలోకి తీసుకుని కొత్త నిర్మాణాన్ని చేపడుతోంది. ప్రధాన గర్భాలయం, మండప భాగాన్ని పటిష్ట పరిచి దాన్ని అలాగే ఉంచి చుట్టూ కొత్త మండపాన్ని నిర్మిస్తారు. పాత నిర్మాణాన్ని అనుసరిస్తూ కొత్త నిర్మాణంతో ఆలయాన్ని విస్తరిస్తారు. పురాణ నేపథ్యంలో ఉన్న ధర్మగుండం, గుడి చెరువు ప్రాశస్త్యం తగ్గకుండా 40 ఎకరాల పరిధిలో నిర్మాణాలు చేపట్టనున్నారు.

రూ.550 కోట్లతో ప్రణాళిక

అన్నదాన సత్రం, క్యూ కాంప్లెక్సు, వసతి గృహాలు, రెండు ప్రాకారాలు, కార్యాలయం, కోనేరు, కల్యాణ కట్ట, కోడె మొక్కుల ప్రాంతం.. ఇలా అన్నీ కొత్తగా నిర్మిస్తారు. భీమేశ్వరాలయం




సహా అనుబంధ దేవాలయాలను అభివృద్ధి చేస్తారు. ఈ మొత్తం పనులకు రూ.550 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ఇందులో ప్రభుత్వం ఇప్పటికే ప్రధాన దేవాలయానికి సంబంధించి రూ.76 కోట్లకు, కల్యాణ మండపానికి సంబంధించి రూ.33 కోట్లకు నిధులు మంజూరు చేసింది. ఇటీవలి బడ్జెట్‌లో మరో రూ.100 కోట్లు ప్రతిపాదించింది. వీటితో పనులు కొనసాగిస్తూ, తదుపరి విడతలకు మరిన్ని నిధులు మంజూరవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. కేంద్రప్రభుత్వ 'ప్రసాద్'పథకంలో భాగంగా 96 గదులతో కూడిన వసతి గృహ నిర్మాణానికి రూ.44 కోట్లు మంజూరయ్యాయి. దీనికి మరిన్ని నిధుల కోసం కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రయత్నిస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

**ఇలా చేపట్టనున్న అభివృద్ధి..**

–ఆలయం 15 డిగ్రీల కోణంలో ఆగ్నేయం దిశ వైపు మళ్లి ఉంటుంది. ఇప్పుడు గర్భాలయం, సభా మండపాన్ని అదే దిశలో నిర్మించి మిగతా భాగాన్ని నేరుగా ఉండేలా సరిదిద్ది విస్తరిస్తారు.

–చారిత్రక, పౌరాణిక నేపథ్యం ఉన్న అన్ని భాగాలను, పురాణాలు, పురాతన గ్రంథాలు, 1970లో వెలుగు చూసిన రాతి శాసనాల్లో పేర్కొన్న విధంగా ప్రాశస్త్యానికి ఇబ్బంది లేకుండా విస్తరిస్తారు. కొన్ని నిర్మాణాలు తదనంతరం వెలిశాయి. వాటి విషయంలో తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

–అన్నదాన సత్రాన్ని రెండెకరాల విస్తీర్ణంలో రెండంతస్తులుగా లక్షన్నర చదరపు అడుగుల మేర రూ.35.35 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు.

–ప్రస్తుత ప్రధాన ఆలయం 4 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, దాన్ని 4.6 ఎకరాల విస్తీర్ణానికి పెంచనున్నారు.

–సరైన ప్రణాళిక లేకపోవటంతో గతంలో ఆలయ పునరుద్ధరణ వంకరటింకరగా జరిగింది. ఇప్పుడు దాన్ని రెండు ప్రాకారాలు, రెండు వీధులతో క్రమపద్ధతిలోకి మార్చనున్నారు.

– ప్రస్తుతం ఇరుకుగా ఉన్న వీధులను రూ.47 కోట్ల వ్యయంతో 80 అడుగుల మేర విస్తరించనున్నారు.

–అన్ని ప్రాంతాల్లో బతుకమ్మ పండుగను 9 రోజులు నిర్వహిస్తే, ఒక్క వేములవాడలో ఏడు రోజులు మాత్రమే జరుగుతుంది. బతుకమ్మ పుష్పం నుంచే ఆలయం ఉద్భవించిందన్న పౌరాణిక గాథ ఉంది. దాన్ని ప్రతిబింబించే తరహా గుర్తులను నిర్మాణంలో చూపనున్నారు.

–పునరుద్ధరణ క్రమంలో గతంలో కొన్ని నిర్మాణాల్లో వేములవాడ చాళుక్యుల శైలి లోపించింది. ఇప్పుడు కొత్త నిర్మాణం యావత్తు ఆ శైలిలోనే ఉండనుంది.

# తిరుపతిలో కొనసాగుతున్న ఉద్రిక్తత .. వైసిపి నేతల మధ్య మాటల యుద్ధం



తిరుపతి, ఏప్రిల్ 17:తిరుపతిలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి.. గోవుల మరణంపై ఇటు వైసిపి, ఇటు కూటమి నేతలు మధ్య మాటలు యుద్ధాలు, సవాళ్లు ప్రతిసవాళ్లతో హీట్ ఎక్కిస్తున్నారు.. ఇక తిరుపతి ఎస్వీ గోశాల వద్ద నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డికి ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, పులివర్తి నాని, కలికిరి మురళీ మోహన్, నవాజ్ బాషాలు ఫోన్ చేశారు. ఎస్వీ గోశాలను సందర్శించాలని భూమనను కూటమి శాసనసభ్యులు కోరారు. అసత్య ఆరోపణలు చేయడం కాదు.. క్షేత్రస్థాయికి రావాలన్నారు. పోలీసుల సూచనల మేరకు ఐదుగురితో గోశాలకు రావాలని సూచించారు. తిరుపతి ఎస్వీ గోశాలకు రావాలని, అవసరమైన భద్రత కల్పిస్తామని భూమన కరుణాకర్ రెడ్డికి టీడీపీ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఫోన్లో చెప్పారు. ఎస్పీతో మాట్లాడి ఎస్కార్ట్ భద్రత ఏర్పాటు చేస్తామని సుధీర్ చెప్పగా.. పోలీసులు అనుమతి ఇస్తే వస్తానంటూ భూమన సమాధానం ఇచ్చారు.

కాగా,వైసిపి ఎంపి గురుమూర్తి తిరుపతిలోని గోశాలకు వచ్చారు.. ఈ సందర్భంగా అక్కడే ఉన్న టిడిపి,కూటమి నేతలు ఆయనను అడ్డుకున్నారు.. భూమనను రమ్మంటే మీరు ఎందుకు వచ్చారంటూ నిలదీశారు. ఛాలెంజ్ చేసిన వ్యక్తి ఇక్కడ రాకుండా అనవసర ఆరోపణలు చేస్తున్నారంటూ టిడిపి నేతలు మండిపడ్డారు.. భూమన వస్తే తామే స్వయంగా గోశాలను చూపుతామన్నారు. ఈ సందర్భంగా గురుమూర్తిని టిడిపి నేతలు గోశాలకు తీసుకెళ్లి అక్కడ గోవులను చూపారు..

గోశాలను కాదు గో స్మశాన వాటికకు వెళదాం–భూమన

గోశాలకు వచ్చి అక్కడ గోవులను పరిశీలిస్తానని అన్న టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆకస్మికంగా యు టర్న్ తీసుకున్నారు.. గోశాలకు వస్తే ఆరోగ్యం వంతంగా ఉన్న గోవులే కనిపిస్తాయని అన్నారు.. అలా కాకుండా చనిపోయిన గోవులను పాతపెట్టిన స్మశాన వాటికను పరిశీలించి అక్కడ తవ్వితే ఎన్ని గోవులు మరణించాయే లెక్కలు తెలుతాయని అన్నారు. తన నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ, తనను గోశాలకు వెళ్లకుండా రాత్రి నుంచి గృహనిర్బంధంలో పోలీసులు ఉంచారన్నారు.. తాను స్వీకరించిన ఛాలెంజ్ కు కట్టుబడి ఉన్నానని , అయితే పోలీసులే తనను అక్కడకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారన్నారు.

తిరుపతి గోశాలలో గోవులకు సరైన సంరక్షణ లేకపోవడంతో వందలాది గోవులు చనిపోతున్నాయంటూ భూమన బహిరంగంగానే ఆరోపించారు. దీనిపై స్పందించిన టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, భాను ప్రకాష్ రెడ్డిలు స్వయంగా వచ్చి గోశాలను చూడాలని ఆహ్వానించారు.. దీనికి భూమన నేడు గోశాలకు వస్తానని, అక్కడే అన్ని లెక్కలు తేలుస్తానని బదులిచ్చారు..

ర్యాలీగా గోశాలకు వెళ్లకుండా అడ్డగింపు –ఇంటి వద్దే భూమన బైఠాయింపు

ఈ నేపథ్యంలోనే తిరుపతిలో సవాళ్లే. ప్రతి సవాళ్లతో తిరుపతి లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పెద్ద ఎత్తున కార్యకర్తలు నేతలతో శాంతి ర్యాలీ నిర్వహించి కరుణాకర్ రెడ్డి చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని తిప్పికొట్టాలని కూటమి నేతలు పిలుపునిచ్చారు. కాగా, టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నివాసం వద్ద నేటి ఉదయం నుంచి ఉద్రిక్తత నెలకొంది. ఎంపీ గురుమూర్తి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, వైసిపి కార్యకర్తలతో కలిసి ఎస్వీ గోశాలకు బయలుదేరిన భూమనను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వైసిపి కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. భూమన పరిమిత సంఖ్యలో నేతలతో గోశాలకు వెళితే అనుమతిస్తామని పోలీసులు తేల్చి చెప్పారు.. మూకుమ్మడి ర్యాలీలను అనుమతి లేదన్నారు.. దీంతో భూమన తన అనుచరులతో తన ఇంటి వద్దే నిరసనకి దిగారు.. అక్కడే నేలపై తన అనుచరులతో పడుకున్నారు. ఇదే సమయంలో కూటమి నేతలు గోశాలను నేడు సందర్శించారు. వైసిపి నేతలు ఇక్కడ కు వచ్చి పరిస్థితులు పరిశీలించాలని వారు డిమాండ్ చేశారు.

ఆంక్షలు లేవు- ఎవరైన గోశాలకు రావచ్చు.

ఇక తిరుమల తిరుపతి దేవస్థానం గోశాలకు గుంపులుగా రావద్దని వైసీపీ నేతలకు తిరుపతి పోలీసుల సూచించారు. టీటీడీ గోశాలలో గోవుల మృతికి సంబంధించి కూటమి ప్రజా ప్రతినిధులు.. తిరుపతి మాజీ ఎమ్మెల్యే సవాళ్లపై పోలీసు శాఖ నేడు ఈ ప్రకటన విడుదల చేసింది. కార్యకర్తలతో కాకుండా గన్ మెన్‌లతో గోశాలను సందర్శించి, మీడియాతో మాట్లాడి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా వెళ్లిపోవాలని భూమన కరుణాకరరెడ్డికి పోలీసులు సూచించారు.

శాంతి ర్యాలీ పేరుతో వందలాది కార్యకర్తలతో కాకుండా గన్ మెన్ లతో గోశాలను సందర్శించి మీడియాతో మాట్లాడవచ్చని కూటమి ఎమ్మెల్యేలు, నాయకులను పోలీసులు కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. 'టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిని గృహనిర్బంధం చేయలేదు. ఎస్వీ గోశాలకు వెళ్లడానికి భూమనకు ఎలాంటి అభ్యంతరం పెట్టలేదు. రెండు పార్టీల నేతలు ఒకే సారి వెళ్లకూడదని సూచించాం. భూమన వ్యక్తిగత భద్రతా సిబ్బందితో వెళ్లవచ్చని సూచించాం' అని తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఒకే సమయంలో అధికార, ప్రతిపక్షాలు గోశాల సందర్శనకు వద్దని ఎస్పీ హర్షవర్ధన్ రాజు సూచించారు. ఎవరినీ గృహ నిర్బంధం చేయలేదని ఎస్పీ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించకుండా గోశాలను ఏ పార్టీ నేతలైనా సందర్శించవచ్చునని ఆయన అన్నారు.

# ముస్లింల హజ్ యాత్రకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:భారతీయ ముస్లింలు వార్షిక హజ్ యాత్ర చేపట్టే అంశానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది.

2014లో దేశానికి కేటాయించిన హజ్ యాత్రికుల కోటా 1,36,020 ఉండగా.. ప్రభుత్వ ప్రయత్నాల కారణంగా 2025 నాటికి 1,75,025కు పెరిగింది. యాత్ర ప్రారంభవడానికి కొన్ని రోజుల ముందు సౌదీ అధికారులు ఈ కోటాను ఖరారు చేస్తారు.

భారత్ కు కేటాయించిన కోటాలో ఎక్కువ భాగానికి అవసరమైన ఏర్పాట్లను భారత హజ్ కమిటీ ద్వారా మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఓఎంఏ) పూర్తి చేస్తుంది. ఈ ఏడాది ఆ సంఖ్య1,22,518 గా ఉంది. సౌదీ విధానాల ప్రకారం విమాన ప్రయాణం, రవాణా, మినా క్యాంపులు, వసతి, అదనపు సేవలను అందించడానికి అవసరమైన ఏర్పాట్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేశారు.

సంప్రదాయం ప్రకారం, మిగిలిన కోటాను ప్రైవేట్ టూర్ ఆపరేటర్లకు కేటాయించారు. సౌదీ మార్గదర్శకాల్లో వచ్చిన మార్పుల ప్రకారం ఈ ఏడాది ఎంఓఎంఏ ద్వారా 800కు పైగా ప్రైవేటు టూర్ ఆపరేటర్లను 26 చట్టబద్ధమైన సంస్థలుగా ఏకీకృతం చేశారు. వీటిని కంబైన్డ్ హజ్ గ్రూప్ ఆపరేటర్ (సీహెచ్‌జీవో)లుగా పిలుస్తారు. న్యాయపరమైన చిక్కులను పరిష్కరిస్తూ, ఈ 26 సీహెచ్‌జీవోలకు ముందుగానే హజ్ కోటాను ఎంవోఎంఏ కేటాయించింది. అయితే, రిమైండర్లు ఇచ్చినప్పటికీ సౌదీ అధికారులు నిర్దేశించిన గడువును అనుసరించడంలో ఈ సంస్థలు విఫలమయ్యాయి. అలాగే మినా క్యాంపులు, వసతి, యాత్రకు రవాణా సహా తప్పనిసరి కాంట్రాక్టులను సౌదీ మార్గదర్శకాలకు అనుగుణంగా ఖరారు చేయడంలోనూ సఫలీకృతం కాలేకపోయాయి.

ఈ అంశంలో మంత్రిత్వ స్థాయితో సహా సంబంధిత సౌదీ అధికారులతో భారత ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు జరిపింది.

యాత్రికుల భద్రతపై, ముఖ్యంగా మినా క్యాంపుల్లో పరిస్థితిపై సౌదీ హజ్ మంత్రిత్వ శాఖ తన ఆందోళనలను తెలియజేసింది. అధిక వేసవి ఉష్ణోగ్రతల మధ్య మినా క్యాంపులో అందుబాటులో ఉన్న అతి తక్కువ స్థలంలో హజ్ యాత్రకు సంబంధించిన ఆచారాలను పూర్తి చేయాల్సి ఉంటుంది.

ఆలస్యం చేయడం ద్వారా మినా క్యాంపులో స్థలాభావం ఏర్పడుతుంది. అదే విధంగా ఈ సారి ఏ దేశానికి గడువు పొడిగించబోమని సౌదీ అధికారులు తెలియజేశారు.

# భూ భారతి చట్టంపై ఈ నెల 30వరకు మండలాల్లో అవగాహన సదస్సులను పక్కాగా నిర్వహించాలి

**– జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.**

సంగారెడ్డి ఏప్రిల్ 17(నేటి నిజం ప్రతినిధి) భూ భారతి చట్టంపై




అవగాహన సదస్సులను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులకు సూచించారు.

కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో భూ భారతి చట్టం పై అదనపు కలెక్టర్ మాధురి ( రెవెన్యూ)ఆర్డీవోలు, తాహసిల్దార్లతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టంలో నోటీసు విధానాన్ని అమలు చేయాలని పక్కాగా ఉందన్నారు.

కొనుగోలు, అమ్మకం దారునికి, మ్యుటేషన్ సందర్భంలో నోటీసు విధానాన్ని అమలు చేయాలన్నారు.

నోటీసు అమలు చేశాక అభ్యంతరాలు ఉంటే పలువురి వాదనలు విని పోర్టల్ లో అప్లోడ్ చేసి పరిష్కరించాలన్నారు.

భూ భారతి లో హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు గాను ముందుగా భూముల సర్వే, మ్యాప్ తయారీ, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ, మొదలగునవి భూ భారతిలో కీలక అంశాలని వెల్లడించారు.

ఈ చట్టంపై ఈ నెల 30 వరకు మండలాల్లో అవగాహన సదస్సులను నజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆయా సదస్సులలో ప్రజలకు ఈ చట్టంపై నిశితంగా అవగాహన కల్పించాలన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తీసుకొచ్చిన "భూ భారతి" ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, రైతు సంఘాల నాయకులు, సభ్యులను కూడా ఈ సదస్సుల్లో భాగస్వామ్యం చేయాలని, చట్టంలో ఉన్న ప్రాధాన్యత అంశాల వివరాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా కరపత్రంపై ముద్రించాలన్నారు.

ఆర్ఓఆర్ తప్పుల సవరణ సెక్షన్–4, 5, 7 ల గురించి, అలాగే ఏ సమస్యకి ఎలా అప్పీల్ చేసుకోవాలి అనే అంశం మీద క్షుణ్ణంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ సదస్సులో అవగాహన కల్పించాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. రమేష్, డిఆర్ఓ పద్మజారాణి, రెవెన్యూ శాఖ అధికారులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రీయ కర్మయోగి జన్ సేవ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆయుష్ మంత్రిత్వ శాఖ




న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:'రాష్ట్రీయ కర్మయోగి జన్ సేవ కార్యక్రమం'లో భాగంగా ఒక సమావేశాన్ని ఆయుష్ శాఖ బుధవారం నిర్వహించింది. ఆయుష్ మంత్రిత్వ శాఖ ఉద్యోగుల్లో సేవాప్రధాన ధోరణిని, వృత్తినైపుణ్యాలను పెంచడం ఈ కార్యక్రమం ఉద్దేశం. ఈ సమావేశాన్ని 'మిషన్ కర్మయోగి'లో భాగంగా కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ సహకారంతో నిర్వహించారు.

ఇదివరకు మార్చి నెల 18న ఏర్పాటు చేసిన ఇదే తరహా సమావేశం ఒకటో దశను ఆయుష్ శాఖ కార్యదర్శి శ్రీ వైద్య రాజేశ్ కోటేచా ప్రారంభించారు. సిబ్బందిని మరింత సమర్థులుగాను, బాధ్యతాయుతంగాను తీర్చిదిద్దడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాలని శ్రీ వైద్య రాజేశ్ కోటేచా స్పష్టం చేశారు. సేవలను మెరుగుపరచాలన్న ధ్యేయంతో అందిస్తున్న శిక్షణను దీనిలో పాల్గొన్న వారు తమ రోజువారీ విధుల నిర్వహణలో అమలు చేయండంటూ వారిని ఆయన ప్రోత్సహించారు.

సమావేశం రెండో దశకు ప్రోగ్రాం డైరెక్టరు డాక్టర్ సుబోధ్ కుమార్ నాయకత్వం వహించగా శిప్రా సింగ్ ఈ సమావేశాన్ని సమన్వయపరిచారు. దీనిలో మాటామంతీ నమూనాను అనుసరించారు. సాంప్రదాయక ఉపన్యాసాలకు బదులు ఆచరణాత్మక శిక్షణకు ప్రాధాన్యాన్నిచ్చారు. ఉద్యోగులు వారు పోషించాల్సిన భూమికలను, అందించాల్సిన తోడ్పాటులను అర్థం చేసుకొనేటట్లు వారితో చర్చించడం, వారిని జట్లు జట్లుగా పనిచేయాలని సూచించడం, వారికి కొన్ని సమస్యలను ఇచ్చి వాటిని పరిష్కరించాలని చెప్పడం వంటి పద్ధతులను శిక్షణలో స్వీయ అవగాహన, ప్రేరణ, నాయకత్వం వహించడం వంటి విషయాలపై దృష్టిని సారిస్తూ నాలుగు సమావేశాల్ని ఏర్పాటు చేశారు. ఆయుర్వేద, యోగా, ఇతర సాంప్రదాయిక వైద్య వ్యవస్థలలో ప్రస్తుతం సాగుతున్న కార్యక్రమాలకు సంబంధించిన కేస్ స్టడీస్‌ను కూడా ఈ ఆచరణాత్మక శిక్షణ కోసం అందజేశారు.

మంత్రిత్వ శాఖ అధికారులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. వ్యక్తిగతంగా స్వీకరించాల్సిన బాధ్యతలు, ప్రజాసేవకు ఉన్న విస్తృత ప్రభావం..వీటి విషయంలో అవగాహనను పెంపొందించడం ఈ కార్యక్రమం లక్ష్యం. ఆయుష్ శాఖ తన సిబ్బందిలో సామర్థ్యాలను, దక్షతను బలోపేతం చేయడానికి తన ప్రయత్నాలను ఇకముందు కూడా కొనసాగిస్తూ ఉంటుంది.

# ఫిన్లాండ్ అధ్యక్షుడు శ్రీ అలెగ్జాండర్ స్టబ్‌తో ఫోన్‌లో సంభాషించిన భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:ఫిన్లాండ్ అధ్యక్షుడు శ్రీ అలెగ్జాండర్ స్టబ్‌తో భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు ఫోన్‌లో మాట్లాడారు.

డిజిటలీకరణ, సుస్థిరత, మొబిలిటీ సహా వివిధ రంగాల్లో ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న సహకారంపై నేతలిద్దరూ సమీక్షించారు. క్వాంటం, 5జీ–6జీ, ఏఐ, సైబర్ భద్రత రంగాలు సహా భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా తమ అంకితభావాన్ని పునరుద్ఘాటించారు.

ఉక్రెయిన్ పరిస్థితి సహా ఉమ్మడి ప్రయోజనాలున్న ప్రాంతీయం, అంతర్జాతీయ అంశాలపై కూడా వారిద్దరూ చర్చించారు. భారత్ ? ఈయూ మధ్య మరింత సన్నిహిత సంబంధాలతోపాటు ఉమ్మడి ప్రయోజనాలున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై వీలైనంత త్వరగా అనిశ్చితిని తొలగించడానికి ఫిన్లాండ్ సహకరిస్తుందని అధ్యక్షుడు స్టబ్ వెల్లడించారు.

# క్షేత్రస్థాయిలో రాజకీయ పార్టీల భాగస్వామ్యాన్ని పెంచేందుకు తొలిసారిగా బూత్ స్థాయి కార్యకర్తల(బీఎల్ఏ)కు కేంద్ర ఎన్నికల కమిషన్ శిక్షణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:రానున్న రాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో బీహార్ కు చెందిన బూత్ స్థాయి కార్యకర్తల (బీఎల్ఏ)కు కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీఐ) శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించింది. తదనుగుణంగా న్యూఢిల్లీ లోని ఇండియా ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ డెమోక్రసీ అండ్ ఎలెక్షన్ మేనేజ్మెంట్–ఐఐఐడీఈఎం లో రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. గుర్తింపు పొందిన 10 బీహార్ రాజకీయ పార్టీల బీఎల్ఏలు కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

తొలిసారిగా ఏర్పాటైన ఇటువంటి శిక్షణా కార్యక్రమంలో భాగంగా ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్, ఇతర ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్ బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషి ప్రతినిధులనుద్దేశించి ప్రసంగించారు. మార్చి 4న జరిగిన ముఖ్య ఎన్నికల అధికారుల (సీఈఓ)ల సమావేశంలో శిక్షణా కార్యక్రమానికి అంకురార్పణ జరిగింది. ఎన్నికల ప్రక్రియలో బీఎల్ఏ పాత్ర ప్రాముఖ్యాన్ని గుర్తించిన కమిషన్, వారికి తగిన శిక్షణనందించడం వల్ల వారి బాధ్యతల నిర్వహణ మరింత మెరుగవగలదని భావించింది. 1950, '51 ప్రజా ప్రాతినిధ్య (ఆర్పీ) చట్టాలు,1960 ఓటర్ల నమోదు నిబంధనల చట్టం, 1961 ఎన్నికల నిర్వహణ నిబంధనల చట్టం, ఎప్పటికప్పుడు కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసే మార్గదర్శక సూత్రాలు బీఎల్ఏల విధుల గురించి పేర్కొంటున్నాయి.

చట్టప్రకారం బీఎల్ఏల నియామకం, పాత్ర, బాధ్యతల పట్ల ప్రతినిధులకు అవగాహన కలిగించారు. ఎన్నికల కోసం సన్నద్ధమవడం, తాజా పద్ధతుల పట్ల అవగాహన, ఎన్నికల జాబితాలు, పత్రాలు, పద్ధతుల్లో జరిగే మార్పులు, చేర్పులు సహా ఎన్నికల ప్రక్రియలోని అన్ని అంశాల పట్ల వారికి అవగాహనను కల్పించారు. 1950 ఆర్పీ చట్టం సూత్రాల ప్రకారం ఎటువంటి లోపాలకు తావులేని ఎన్నికల నిర్వహణలో బీఎల్ఏలు కీలక పాత్ర పోషిస్తారు, దాంతో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీలు వీరిని నియమిస్తాయి. ప్రకటించిన తుది ఎన్నికల ఫలితాల పట్ల అసంతృప్తి చెందిన పక్షంలో 1950 ఆర్పీ చట్టంలోని 24ఏ, 24బీ సెక్షన్ల ప్రకారం మొదటి, రెండో అప్పీళ్ళ ద్వారా తమ ఫిర్యాదుని నమోదు చేయడం గురించి కూడా బీఎల్ఏలకు శిక్షణనిస్తున్నారు.

# రాజకీయంగా ఎదుర్కొనే శక్తి లేక దొంగ కేసులు - బిజెపిపై కాంగ్రెస్ మండిపాటు




హైదరాబాద్, ఏప్రిల్ 17: నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను ఈడీ ఛార్జ్‌షీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి, ఈడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

ఈ క్రమంలోనే కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక కేంద్ర దర్యాప్తు సంస్థలతో ప్రధాని నరేంద్ర మోడీ దొంగ కేసులు పెట్టిస్తున్నాడని ఆరోపించారు. బ్రిటీష్ వాళ్లకే భయపడని కాంగ్రెస్ నిఖార్సైన లీడర్లు మోడీకి భయపడతారని అనుకోవడం వాళ్ల మూర్ఖత్వమేనని కామెంట్ చేశారు. తమ అధినాయకులపై కుట్రలు చేస్తున్న నరేంద్ర మోడీ , అమిత్ షా లు పెద్ద కేడీలు అంటూ మండిపడ్డారు.

దేశం కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబంపై కక్ష

దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం అన్యాయంగా కక్షగట్టారని దయాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర సంగ్రామంలో బీజేపీ నాయకుల పాత్ర ఎక్కడుందో చెప్పాలని ప్రశ్నించారు. సెంటు భూమి, సొంత ఇల్లు కూడా లేని రాహుల్, సోనియాలపై కుట్రలు చేస్తే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ వాదుల ఏకమవుతారు.. ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. 2029లో కేంద్రంలోని బీజేపీ సర్కార్‌ను తన్ని తరిమేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అన్నారు. దేశ ప్రతిపక్ష నాయకుడి రాజకీయాల నుంచి టర్మినేట్ చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. దేశంలో బీజేపీ నాయకులు విద్వేషాన్ని రేపుతుంటే.. తమ నాయకులు రాహుల్ గాంధీ ప్రేమను పంచుతున్నాడని.. అది కాంగ్రెస్ పార్టీ విధానమని. దేశంలో జరుగుతోన్న అక్రమాలను ప్రజాస్వామ్యవాదులు ప్రశ్నిస్తే.. వారిపై ఈడీ, ఐటీ దాడులు చేయిస్తున్న మోడీని పాతాళంలోకి తొక్కేస్తామని అద్దంకి దయాకర్ అన్నారు.

# వజ్రోత్సవ జన్మదిన వేడుకలు -యూరప్‌లో జరుపుకోనున్న చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 17: తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 20న చంద్రబాబు డైమండ్ జూబ్లీ అంటే 75వ పుట్టినరోజు జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబసభ్యులతో విదేశాల్లోనే ఆ వేడుకలను చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. సందర్భంగా ఆయన తన కుటుంబ సభ్యులతో కలసి రేపు యూరప్ పర్యటనకు బయలుదేరనున్నారు.. అక్కడే వజ్రోత్సవ జన్మదినోత్సవాన్ని కుటుంబసభ్యులతోనే చేసుకోనున్నారు.. యూరప్ లో ఆయన మూడు రోజుల పాటు ఉండనున్నట్లు సమాచారం.. ఇక ఈ నెల 22వ తేదీన తిరిగి ఢిల్లీకి రానున్నారు సీఎం . ఈ నెల 23న పలువురు కేంద్ర మంత్రులను కలిసే అవకాశం ఉంది. ఈ మేరకు సీఎం యూరప్ పర్యటన షెడ్యూల్ ఫిక్స్ అయింది.

ఇది ఇలా ఉంటే చంద్రబాబు రాజకీయ జీవితంలో పుట్టిన రోజులు కూడా ఎప్పుడూ కుటుంబంతో గడపలేదు. కానీ ఇప్పుడు మాత్రం 75వ పుట్టిన రోజును మనవడితో సహా కుటుంబసభ్యులు అందరి సమక్షంలో చేసుకోవాలని నిర్ణయించారు. 2019లో ఓడిపోయిన తర్వాత చంద్రబాబు కుటుంబానికి సమయం కేటాయించడం ప్రారంభించారు. అంతకు ముందు ఆయన పరిపాలనలో ప్రజల్లోనే ఎక్కువగా ఉండేవారు. 2019 తర్వాత మెల్లగా కుటుంబానికి సమయం పెంచారు. వీకెండ్స్ లో కుటుంబంతో గడుపుతున్నారు.

ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా వారానికి ఒక్క రోజు అయినా కుటుంబంతో గడుపుతున్నారు. కుటుంబ కార్యక్రమాలకూ హాజరవుతున్నారు. నారా రోహిత్ ఎంగేజ్మెంట్‌కు కూడా హాజరయ్యారు. మొత్తంగా చంద్రబాబు కుటుంబానికీ కొంత సమయం కేటాయిస్తూ ఉండటంతో.. ఫ్యామిలీ మెంబర్స్ కూడా కొన్ని ముఖ్యమైన వేడుకల్ని కలిసి చేసుకునేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ఈ సారి చంద్రబాబు పుట్టిన రోజును కుటుంబం అంతా కలసి చేసుకోనుంది.

ఈ నెల 20వ తేదీన చంద్రబాబు 75వ జన్మదినోత్సవం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలు జరుపుకోనున్నారు.

# యుజిసి నెట్ నోటిఫికేషన్ విడుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:యూజీసీ నెట్ జూన్ 2025 పరీక్షకు సంబంధించిన నోటిఫికేషన్?ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) విడుదల చేసింది. పరీక్షకు దరఖాస్తు ప్రక్రియ కూడా ప్రారంభమైంది. భారతీయ విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అవార్డుకు భారతీయ పౌరుల అర్హతను నిర్ణయించడానికి యుజిసి నెట్ పరీక్షను నిర్వహిస్తారు. పరీక్షకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పరీక్ష ప్రక్రియ, అర్హత ప్రమాణాలు, ముఖ్యమైన తేదీలు, దరఖాస్తు ప్రక్రియలకు సంబంధించిన సమగ్ర వివరాలను అందించే ఎన్టీఏ బులెటిన్‌ని జాగ్రత్తగా చదవాలి. యూజీసీ నెట్ జూన్ 2025కు అభ్యర్థులు ఆన్?లైన్ విధానంలో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అప్లికేషన్ ఫామ్ మరే ఇతర మోడ్‌లోనూ ఆమోదించరు.

## యూజీసీ నెట్- 2025 నోటిఫికేషన్- కీలక తేదీలు

దరఖాస్తు విండో: 16 ఏప్రిల్ 2025 నుంచి 7 మే 2025 (రాత్రి 11:59 గంటల వరకు)

ఫీజు చెల్లింపునకు చివరి తేదీ: 8 మే 2025 (రాత్రి 11:59 గంటల వరకు)

కరెక్షన్ విండో: 9 మే నుంచి 10 మే 2025

అడ్మిట్ కార్డు విడుదల: అధికారిక ఎన్టీఏ వెబ్‌సైట్‌లో ప్రకటించాల్సి ఉంది.

పరీక్ష తేదీలు: 21 జూన్ 2025 నుంచి 30 జూన్ 2025 వరకు.

ఫలితాల ప్రకటన: నిజీబిఎనీజీటీట.వటబీ.తిని లో తేదీ వెల్లడించాల్సి ఉంది

యూజీసీ నెట్ జూన్ 2025 రెండు పేపర్లతో కూడిన కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. పేపర్ 1: టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ, కాంప్రహెన్షన్, జనరల్ అవేర్‌నెస్. పేపర్-2: అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టు ఆధారంగా సబ్జెక్టు స్పెసిఫిక్ పేపర్ రెండు పేపర్లలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు (ఎంసీక్యూలు) ఉంటాయని, వాటి మధ్య విరామం లేకుండా నిర్వహిస్తామన్నారు.

అర్హత యూజీసీ నెట్- 2025 అభ్యర్థులు మాస్టర్స్ డిగ్రీ లేదా యూజీసీ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు / సంస్థల నుంచి మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో కనీసం 55% మార్కులు (రిజర్వ్ కేటగిరీలకు 50%) సాధించి ఉండాలి.

వయోపరిమితి: జేఆర్ఎఫ్ : 2025 జూన్ 1 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది

అసిస్టెంట్ ప్రొఫెసర్: గరిష్ఠ వయోపరిమితి లేదు.

దరఖాస్తు విధానం అభ్యర్థులు అధికారిక ఎన్టీఏ వెబ్సైట్: https://ugcnet.nta.ac.in ని ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ప్రక్రియలో రిజిస్ట్రేషన్, వ్యక్తిగత, అకాడమిక్ వివరాలను నింపడం, అవసరమైన డాక్యుమెంట్లను అప్లోడ్ చేయడం, పరీక్ష ఫీజు చెల్లించడం ఉంటాయి.

పరీక్ష ఫీజు -జనరల్ /అన్ రిజర్వ్ డ్ : రూ.1,150

జనరల్ -ఈడబ్ల్యూఎస్ /ఓబీసీ-ఎన్ సీఎల్ : రూ.600

ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/థర్డ్ జెండర్ : రూ.325

సబ్జెక్టులు, పరీక్షా కేంద్రాలు.

యూజీసీ నెట్ జూన్ 2025లో వివిధ రకాల సబ్జెక్టులు ఉంటాయి. అధికారిక బులెటిన్?లో సబ్జెక్టుల వివరాలతో పాటు వాటి కోడ్‌లను పొందుపరిచారు. ఈ పరీక్షను భారతదేశంలోని వివిధ నగరాల్లో నిర్వహిస్తారు. ఇది అభ్యర్థులు తమకు నచ్చిన పరీక్షా కేంద్రాన్ని ఎంచుకునే వెసులుబాటును కల్పిస్తుంది.

ముఖ్యమైన సూచనలు.. అప్లికేషన్ ఫామ్‌లో ఇచ్చిన మొత్తం సమాచారం ఖచ్చితమైనది, సంపూర్ణమైనదిగా ధృవీకరించుకోండి. ఃభవిష్యత్తు రిఫరెన్స్ కోసం అప్లికేషన్ పేజీ, చెల్లింపు రసీదు కాపీని ప్రింటౌట్ తీసుకోండి.

# తలనొప్పి తగ్గేందుకు ఇంగ్లిష్ మెడిసిన్‌తో పనిలేదు..

## -ఇంటి చిట్కాలను పాటిస్తే చాలు..



హైదరాబాద్ ఏప్రిల్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రస్తుతం చాలా మంది నిత్యం తలనొప్పి సమస్యతో బాధపడుతున్నారు. దీన్ని పట్టించుకోకుండా అలాగే నిర్లక్ష్యం చేస్తే అది మైగ్రేన్‌గా కూడా మారుతోంది. తలనొప్పి వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. పని ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, ఆరోగ్య సమస్యలు వంటి కారణాల వల్ల చాలా మంది తలనొప్పి బారిన పడుతుంటారు. ఇక ఎండకాలం శరీరంలో నీరు త్వరగా ఆవిరైపోతుంది. దీంతో తలనొప్పి వస్తుంది. డీహైడ్రేషన్ బారిన పడితే తలనొప్పి వస్తుంది. అయితే తలనొప్పి వస్తే అందుకు ఇంగ్లిష్ మెడిసిన్‌ను వాడాల్సిన పనిలేదు. మన ఇంట్లో ఉండే పలు పదార్థాలతోనే సహజసిద్ధంగా తలనొప్పి నుంచి బయట పడవచ్చు. అందుకు ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

అల్లం టీ..

ఎండాకాలంలో శరీరంలోని నీరు త్వరగా బయటకు పోతుంది. దీంతో డీహైడ్రేషన్ బారిన పడతారు. ఇది తలనొప్పిని కలగజేస్తుంది. ఒక వేళ మీకు వచ్చిన తలనొప్పి ఇలాంటిదే అయితే నీళ్లను బాగా తాగాలి. నీటి శాతం అధికంగా ఉండే పుచ్చకాయలు, తర్బూజా వంటి పండ్లతోపాటు కీరదోసను తినాలి. దీంతో శరీరం కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్‌ను తిరిగి పొందుతుంది. అలాగే శరీరంలో నీటి శాతం పెరుగుతుంది. దీంతో తలకు రక్త ప్రసరణ మెరుగు పడి తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే అల్లం టీని సేవిస్తున్నా కూడా తలనొప్పి నుంచి బయట పడవచ్చు. అల్లంలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి తలనొప్పిని తగ్గిస్తాయి. చిన్న అల్లం ముక్కను నీటిలో వేసి మరిగించి ఆ నీటిలో కాస్త తేనె కలిపి రోజూ ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఒక కప్పు మోతాదులో అల్లం టీని సేవించాలి. దీంతో కూడా తలనొప్పి తగ్గిపోతుంది.

పెప్పర్‌మింట్ ఆయిల్..

పెప్పర్‌మింట్ ఆయిల్ మనకు మార్కెట్‌లో లభిస్తుంది. దీని ఎసెన్షియల్ ను తెచ్చి అందులో కాస్త ఆలివ్ ఆయిల్ లేదా కొబ్బరినూనెను కలపాలి. ఈ మిశ్రమాన్ని నుదుటిపై రాయాలి. రోజుకు ఇలా 2 సార్లు చేస్తే తలనొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు. బాగా కాంతి ఎక్కువగా ఉండే వస్తువులను తదేకంగా చూసినా కొందరికి తలనొప్పి వస్తుంది. అంటే ఉదాహరణకు టీవీలు లేదా కంప్యూటర్లు, ఫోన్లకు బ్రైట్‌నెస్‌ను అధికంగా పెట్టి కొందరు చూస్తారు. ఇది అసలు మంచిది కాదు. కళ్లపై తీవ్రమైన ఒత్తిడి పడేలా చేస్తుంది. దీంతో తలనొప్పి వస్తుంది. కనుక డిజిటల్ తెరలను ఎల్లప్పుడూ చాలా తక్కువ బ్రైట్‌నెస్‌లోనే వీక్షించాలి. అలాగే తలనొప్పి అధికంగా ఉన్నవారు అరటి పండ్లను తింటే మేలు జరుగుతుంది. ఈ పండ్లలో ఉండే మెగ్నిషియం, యాంటీ ఆక్సిడెంట్లు తలనొప్పిని తగ్గిస్తాయి.

పండ్లు, నట్స్..

రాస్ప్ బెర్రీలు, బ్లూబెర్రీలు, స్ట్రాబెర్రీలను ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగిస్తాయి. దీంతో వాపులు తగ్గుతాయి. తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. యాప్రికాట్స్ లేదా అంజీర్ పండను ఆహారంలో భాగం చేసుకుంటున్నా కూడా తలనొప్పి నుంచి బయట పడవచ్చు. అలాగే మెగ్నిషియం అధికంగా ఉండే బాదం పప్పు, జీడిపప్పు, అవిసె గింజలు, చియా విత్తనాలు, గుమ్మడి కాయ విత్తనాలు, బ్రెజిల్ నట్స్‌ను తింటుం డాలి. వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ ఇ కూడా ఉంటాయి. ఇవి వాపులను, నొప్పులను తగ్గించేందుకు అద్భుతంగా పనిచేస్తాయి. కనుక తలనొప్పి అధికంగా ఉన్నవారు మెడిసిన్లను వాడకుండా ఈ చిట్కాలను పాటిస్తే తలనొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు. అయితే ఏం చేసినా తలనొప్పి తగ్గడం లేదు అనుకునేవారు డాక్టర్‌ను కలిస్తేనే మంచిది.

# మందు బాబులకు షాక్.. మళ్లీ పెరగనున్న మద్యం ధరలు..?

హైదరాబాద్ ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : మందుబాబులకు షాకింగ్ న్యూస్.. త్వరలోనే మళ్లీ మద్యం ధరలు పెంచేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే బీర్ల ధరలను 15 శాతం పెంచిన ప్రభుత్వం ఇప్పుడు లిక్కర్ ధరలు పెంచాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. చీప్ లిక్కర్ మినహాయించి.. రూ.500 కంటే ఎక్కువ ఉన్న లిక్కర్ బాటిళ్లపై కనీసం 10 శాతం పెంచనున్నట్లు సమాచారం. ప్రతి లిక్కర్ బాటిల్‌పై కనీసం రూ. 50 పెరిగే అవకాశం ఉంది. ఎక్సైజ్ అధికారులతో సమీక్షించిన అనంతరం ధరల పెంపుపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.రెండు, మూడు విధానాల్లో లిక్కర్ ధరలను పెంచి ఆ వివరాలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలుస్తోంది. ఏయే విధానం ద్వారా ఎంత ఆదాయం ప్రభుత్వానికి పెరుగుతుందో కూడా ఆ నివేదికల్లో వెల్లడిస్తారు. అధికారులతో సమీక్షించిన తర్వాత మరింత లోతైన అధ్యయనం చేసి ధరలు పెంపుపై నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. ఏడాదికి తక్కువలో తక్కువ అనుకున్నా రూ. 2000 కోట్లు అదనపు రాబడి రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో రాష్ట్ర ప్రభుత్వం బీర్ల ధరలను పెంచిన సంగతి తెలిసిందే. బీర్ల ధరలను 15 శాతం వరకు పెంచుకునేందుకు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ధరల పెరగడంతో ఒక్కో బీరుపై సగటున రూ.20 నుంచి రూ.30 వరకు పెరిగింది. ఉత్పత్తిదారుల విజ్ఞప్తులు, పక్క రాష్ట్రాల్లో ధరలను అధ్యయనం చేసిన కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడంతో 15 శాతం ధరలు పెంచుకోవచ్చని చెప్పింది.

# బీట్ ఆఫీసరుపై దాడి.. ఇద్దరి అరెస్టు !

ఆదిలాబాద్, ఏప్రిల్ 17:కవ్వాల టైగర్ రిజర్వ్‌లోని ఇందనపల్లి రేంజ్‌లోని భర్తరన్‌పేట్‌లో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రుబీనా తలత్ ను తన విధులను నిర్వర్తించకుండా ఆటంకపరిచి, ఆమెతో పాటు ఆమె భర్త అఫ్రోజుపై దాడి చేసిన కొందరు దుండగులను గురువారం అరెస్టు చేసి లక్షెట్టిపేట కోర్టులో హాజరుపరిచినట్లు స్థానిక ఎస్ఐ గుండేటి రాజవర్ధన్ తెలిపారు.

దాడికి పాల్పడిన వారిని మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కవ్వాలకు చెందిన ఎం.డి ఎజాజోద్దీన్, జన్నారంకు చెందిన ఎం.డి రియాజోద్దీన్ గా గుర్తించినట్టు రాజవర్ధన్ తెలిపారు.

రుబీనా ఫిర్యాదు మేరకు ఈనెల 7న కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. ఇద్దరు నిందితులను ఉదయం అరెస్ట్ చేసి లక్షెట్టిపేట జడ్జి ఎదుట హాజరు పరచగా, న్యాయస్థానం ఎజాజోద్దీన్, రియాజోద్దీన్ లకు 14 రోజులు రిమాండ్ విధించగా, అక్కడే ఉన్న జైలుకు తరలించినట్లు ఆయన చెప్పారు.

# టైప్-5 డయాబెటిస్!

## -కొత్త రకం మధుమేహాన్నిఅధికారికంగా గుర్తించిన ఐడీఎఫ్

## -పోషకాహార లోపంతో బాధపడే టీనేజర్లు, యువతకు ముప్పు




న్యూఢిల్లీ ఏప్రిల్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: టైప్ 5 డయాబెటిస్.. కొత్త రకం మధుమేహం ఇది. సన్నగా, పోషకాహార లోపంతో బాధపడే టీనేజర్లకు, యువతకు ఈ డయాబెటిస్ సోకుతుంది. అనేక దశాబ్దాల తర్వాత దీనిని అధికారికంగా గుర్తించారు. అంతర్జాతీయ మధుమేహ సమాఖ్య (ఐడీఎఫ్) బ్యాంకాక్‌లో నిర్వహించిన ప్రపంచ మధుమేహ కాంగ్రెస్‌లో టైప్ 1, టైప్ 2 డయాబెటిస్‌లకు భిన్నమైన, పోషకాహార లోపానికి సంబంధించిన మధుమేహానికి గుర్తింపునిచ్చి, టైప్ 5 డయాబెటిస్‌గా నామకరణం చేశారు. డాక్టర్ మెరిడిత్ హాకిన్స్ పరిశోధనల ఫలితంగా దీనిని ప్రత్యేక క్యాటగిరీగా గుర్తించారు. ప్రపంచవ్యాప్తంగా 2-2.5 కోట్ల మంది టైప్-5 డయాబెటిస్‌తో బాధపడుతున్నట్టు అంచనా. వీరిలో అత్యధికులు ఆసియా, ఆఫ్రికాలోని అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెందినవారే.

ఏమిటీ టైప్-5 డయాబెటిస్..

టైప్ 5 డయాబెటిస్‌ను పోషకాహార లోపానికి సంబంధించిన మధుమేహం అని పిలుస్తారు. ఇది ముఖ్యంగా బాల్యంలో సన్నగా, సుదీర్ఘ కాలం పోషకాహార లోపంతో జీవించినవారికి సోకుతుంది. టైప్ 2 డయాబెటిస్ ఊబకాయం, ఇన్సులిన్ రెసిస్టెన్స్‌కు సంబంధించినది. కానీ టైప్ 5 డయాబెటిస్ పాంక్రియాస్ దయనీయంగా ఉండటం వల్ల వస్తుంది. అనేక సంవత్సరాలపాటు పోషకాహారం లేకపోవడం వల్ల సోకుతుంది. ఈ వ్యాధి సోకినవారికి తగినంత ఇన్సులిన్‌ను తయారు చేయడం కష్టంగా ఉంటుంది. బ్లడ్ సుగర్ లెవెల్స్‌ను నియంత్రించడానికి ఇన్సులిన్ హార్మోన్ దోహదపడుతుంది. అయితే, టైప్ 2 డయాబెటిస్ రోగుల మాదిరిగా కాకుండా, టైప్ 5 డయాబెటిస్ రోగుల శరీరాలు ఇన్సులిన్‌కు స్పందించే తీరు బాగానే ఉంటుంది. దీనివల్ల టైప్ 1, టైప్ 2 డయాబెటిస్‌లకన్నా టైప్ 5 డయాబెటిస్ భిన్నమైనదిగా గుర్తింపు పొందింది. టైప్ 5 డయాబెటిస్ రోగుల్లో చాలా మందికి ఇన్సులిన్ ఇంజెక్షన్ల అవసరం ఉండకపోవచ్చు. వీరికి ఓరల్ మెడిసిన్స్‌తోనే చికిత్స చేయవచ్చు. దీనివల్ల అల్పాదాయ పరిస్థితుల్లో చికిత్స అందుబాటులో ఉంటుంది.

1950లలోనే గుర్తించినా..

పోషకాహార లోపానికి సంబంధించిన మధుమేహాన్ని మొదట 1950లలోనే గుర్తించినప్పటికీ, అంతర్జాతీయ పరిశోధనల్లో దీనికి అంత ప్రాధాన్యం దక్కలేదు. 1985లో ప్రపంచ ఆరోగ్య సంస్థ దీనిని ప్రత్యేక క్యాటగిరీగా వర్గీకరించింది. అయితే కానీ 1999లో ఈ క్యాటగిరీని ఉపసంహరించింది. పోషకాహార లోపం లేదా ప్రొటీన్ కొరత వల్ల మధుమేహం వస్తున్నట్లు తెలిపే ఆధారాలు లేవని చెప్పింది. 2010లో డాక్టర్ హాకిన్స్ గ్లోబల్ డయాబెటిస్ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటుచేసి, దీనిపై పరిశోధనలు జరిపారు. 2022లో ఆమె బృందం జరిపిన అధ్యయనంలో పోషకాహార లోప మధుమేహానికి ఆధారాలు గుర్తించారు.

# గోశాల వద్దకు వైసిపి నేతలను అనుమతించే ధైర్యం టిడిపికి ఉందా?

## -సవాల్ చేసిన వాళ్లే అడ్డుకోవడం ఎంత వరకు సమంజసం

## -కూటమి ప్రభుత్వంలో తిరుమల ప్రతిష్ట రోజు రోజుకు దెబ్బతింటోంది

-దుయ్యబట్టిన మాజీ మంత్రి రోజా



తిరుపతి ఏప్రిల్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: టిడిపి నేతల సవాల్‌కు వైసిపి నేత, టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సిద్ధమయ్యారని మాజీ మంత్రి రోజా తెలిపారు. గోవుల మృతిపై వివరించేందుకు భూమన కరుణాకర్ రెడ్డి టిటిడి గోశాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రోజా మీడియాతో మాట్లాడారు. గోశాల వద్దకు వైసిపి నేతలను అనుమతించే ధైర్యం టిడిపికి ఉందా.. అని ప్రశ్నించారు. సవాల్ చేసిన వాళ్లే అడ్డుకోవడం ఎంత వరకు సమంజసం అని చురకలంటించారు. కూటమి ప్రభుత్వంలో తిరుమల ప్రతిష్ట రోజు రోజుకు దెబ్బతింటోందని దుయ్యబట్టారు. సనాతన ధర్మం అంటే ఇదేనా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అని రోజా నిలదీశారు. గోవుల మృతిపై కమిటీ వేసి తప్పు చేసిన వాళ్లను శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులను టిడిపి కార్యకర్తలాగా వాడుకొని తప్పుడు కేసులు పెడుతాం, జైల్లో పెడుతాం అంటే ఊరుకోమని హెచ్చరించారు.

వైకుంఠ ఏకాదశి క్యూలైన్ లో తొక్కిసలాట జరగడంతో భక్తులు చనిపోయారని, ఈ ఘటనలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకున్నారా.. సిఎం చంద్రబాబు నాయుడును ప్రశ్నించారు. తప్పు చేసిన వాళ్లని శిక్షించాలని కానీ ప్రశ్నించిన వారిని శిక్షిస్తే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత రూల్స్ వ్యతిరేకంగా పని చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. టిటిడి గోశాలలో గోవుల మృతిపై భూమన కరుణాకర్ రెడ్డికి టిడిపి నేతలు ఛాలెంజ్ విసిరారు. ఛాలెంజ్ స్వీకరించి టిటిడి గోశాలకి వెళ్లేందుకు భూమన సిద్ధం కావడంతో పోలీసుఉ అడుకున్న విషయం తెలిసిందే.

# ఏసిబికి చిక్కిన బొడ్డవలస విఆర్వో

విజయనగరం, ఏప్రిల్ 17: డెంకాడ మండలం బొడ్డవలస విఆర్ఓ శ్రీనివాసరావు 13 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు గురువారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గ్రామంలోని ఒకరికి అనుకూలంగా నివేదిక ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేశారు శ్రీనివాసరావు.. దీంతో బాధితుడు సమాచారాన్నిఎసిబి అధికారులకు అందించాడు.. నేడు కార్యాలయంలోనే బాదితుడు శ్రీనివాసరావుకి లంచం ఇస్తుండగా వలపన్ని పట్టుకున్నారు.. అతడిపై కేసు నమోదు చేసి ఉన్నతాదికారులకు సమాచారం ఇచ్చారు.

# యంగ్ గ్లోబల్ లీడర్‌గా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఎన్నిక

అమరావతి ఏప్రిల్ 17 (ఎక్స ప్రెస్ న్యూస్ );యంగ్ గ్లోబల్ లీడర్‌గా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఎన్నికయ్యారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం గ్లోబల్ యంగ్ లీడర్ జాబితాలో కేంద్రమంత్రి రామ్మోహన్ చోటు దక్కించుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా తమ రంగాలలో ఉత్తమ నాయకత్వం కనబరిచిన యువ నాయకులకు గుర్తింపుగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం జాబితా ప్రకటించింది. భారతదేశం నుంచి ఏడుగురిని ఎంపిక చేసింది.కాగా, యంగ్ గ్లోబల్ లీడర్‌గా ఎంపికైన రామ్మోహన్‌కు ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఇది దేశానికి ప్రతిష్ఠాత్మక గుర్తింపు అని, ముఖ్యంగా తెలుగువారికి గర్వకారణమని సిఎం చంద్రబాబు అన్నారు. ప్రజాసేవలో రామ్మోహన్ అంకితభావం.. యువతకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందన్నారు. దీనిపై స్పందించిన మంత్ర నారా లోకేశ్.. యంగ్ గ్లోబల్ లీడర్‌గా రామ్మోహన్ ఎంపిక కావటం ఏపీ, భారత్‌కు గర్వకారణమని పేర్కొన్నారు.

# సంకల్పంతో చదివితే లక్ష్యాన్ని సాధించవచ్చు: ఎమ్మెల్యే బొజ్జు పటేల్




ఆదిలాబాద్, ఏప్రిల్ 17:విద్యార్థులు సంకల్పంతో చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని, ఉన్నత స్థాయికి ఎదగవచ్చని, అదే దిశగా విద్యార్థులు ఒక లక్ష్యంతో చదువుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు హెచ్ కే జి ఎన్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఒక స్ఫూర్తితో ముందుకు సాగాలని, తాను కూడా డిగ్రీ చదివే రోజుల్లో ఇప్పుడున్న సౌకర్యాలు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు చదువుకోవాలన్నారు. తనకు ఉద్యోగం అంటే ఇష్టం లేదని ఉద్యమ నాయకునిగా రాజకీయాల్లో ఎదగాలనే తపనతో ముందుకు వెళ్లగా, చాలు అనుకున్న లక్ష్యాన్ని ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు సేవచేసే యోగ్యం లభించిందన్నారు. తనలాగే ఒక లక్ష్యంతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం కళాశాలలో క్రీడల్లో, ఇతర రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ఎమ్మెల్యే మెమొంటోలతో సన్మానం చేశారు.

కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2007లో నుండి ప్రారంభమైందని తెలిపారు. ఇప్పటి వరకు కళాశాల ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్నామని, క్రీడలు నైపుణ్యాల్లో కళాశాల విద్యార్థులు రాణించడం రాష్ట్రస్థాయిలో మూడో బహుమతి గెలవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఐటీడీఏ పీవీటీజీ ఏపీఓ, బీడీ కళాశాల ప్రిన్సిపల్ మేస్రం మనోహర్, జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జైవంత్ రావు, కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గం ఆత్రం రాహుల్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్, పూర్వ ప్రిన్సిపాల్ స్వామి, వైస్ ప్రిన్సిపాల్ సాయి ప్రసాద్, కళాశాల కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థినీలు, తదితరులు పాల్గొన్నారు.

37వ ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డుల ప్రదానోత్సవం

37వ ఉమ్మడి శెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు 2024 | ఉమ్మడి శెట్టి సతీష్ కుమార్ జాతీయ యువ పురస్కారం 2025 | డా॥ రాధేయ కవితా పురస్కారం 2025

కవయిత్రి : వైష్ణవి శ్రీ ఉత్తమ కావ్యం | యువకవి, నందకిషోర్ | కవయిత్రి : సుధా మురళి అవార్డుల ప్రదాత రాధేయ

ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్ట్ - అనంతపురము - తెలంగాణా రచయితల వేదిక , కరీంనగర్ ఆధ్వర్యంలో...

తేది : 04-05-2025 ఆదివారము ఉదయం 10 గం॥లకు వేదిక : ఫిలిం భవన్, కరీంనగర్

సభాధ్యక్షులు: గాజోజు నాగభూషణం గారు, ప్రముఖ కవి, తెరవే

డా॥ నలిమెల భాస్కర్ గారు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

సభా పరిచయం: దోర్నాదుల సిద్ధార్థ గారు

సభా సమన్వయం: డా॥ అంకె శ్రీనివాస్ గారు, పుప్పాల శ్రీరామ్ గారు

ఆత్మీయ అతిథులు: అన్నవరం దేవందర్ గారు, ప్రముఖ కవి | సి.వి. కుమార్ గారు, తెరవే జిల్లా అధ్యక్షులు | ప్రభు గారు, ప్రముఖ కవి, కాకినాడ | ఆత్మీయ సందేశాలు: కందుకూరి అంజయ్య, ప్రముఖ కవి, విమర్శకులు

ప్రసంగకర్తలు: డా॥ సుంకర గోపాలయ్య గారు, వైష్ణవిశ్రీ కవిత్వం | మానస దామర్తి గారు, నందగోపాల్ కవిత్వం | డా॥ పెద్దారు సునీల్ గారు, సుధా మురళి కవిత్వం

డా॥ రాధేయ కవితా పురస్కారం వ్యవస్థాపకులు: సిద్ధార్థ, డా॥సునీల్, డా॥ గోపాలయ్య

అందరికి ఇదే మా ఆహ్వానం

డా॥ రాధేయ, ఛైర్మన్, ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్ట్, అవార్డు వ్యవస్థాపకులు, అనంతపురము

వాణీ ప్రింటర్స్ / అనంతపురము

